ప్రజాశక్తి
బుధవారం 25 సెప్టెంబర్ 2024
5
అనంతపురం



సీడాఫ్ ఛైర్మన్‌గా దీపక్‌రెడ్డి

◆ మరో నలుగురికి సభ్యులుగా అవకాశం

◆ నామినేటెడ్‌లో ఆశావహులకు నిరాశ



దీపక్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎట్టకేలకు నామినేటెడ్ పదవుల నియామకాలు జరిగాయి. మొదటి విడతలో అనంతపురం జిల్లాకు ఒక ఛైర్మన్, నలుగురికి సభ్యులుగా చోటు దక్కింది. మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డికి నామినేటెడ్ పదవి దక్కింది. మరిన్ని కమిటీల్లో సభ్యులుగా నలుగరిని నియమించింది. సీడాప్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఎపి) ఛైర్మన్‌గా దీపక్‌రెడ్డిని నియమించారు. రాయదుర్గం నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా ఉన్న దీపక్‌రెడ్డి ఉన్న సమయంలో 2014లో ఎమ్మెల్యేగా టిడిపి అధిష్టానం టిక్కెట్టు ఇవ్వలేదు. ఆ స్థానంలో కాలవ శ్రీనివాసులకు ఇచ్చారు. తిరిగి 2019, 2024 ఎన్నికల సమయంలోనూ కాలవ శ్రీనివాసులుకే ఇచ్చారు. ఈ సమయంలో స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా దీపక్‌రెడ్డికి పదవినిచ్చారు. అది పూర్తయిన నేపథ్యంలో ఇప్పుడు ఆయనకు సీడాప్ ఛైర్మన్ పదవిని ఇచ్చారు.

మరో నలుగురు సభ్యులు

ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి నలుగురు సభ్యులకు వేరువేరు కమిటీల్లో సభ్యులుగా నియమితులయ్యారు. ఎపి అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్టర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా ధర్మవరం టిడిపి నాయకులు గోనుగుంట్ల విజయ్‌కుమార్, పుట్టపర్తి నియోజకవర్గం నుంచి భూక్య కాలే నాయక్‌ను నియమించారు. ఎపి మార్కెట్ కమిటీలో సభ్యుడిగా కెసి.హరి, ఎపి సీడ్ కార్పొరేషన్ సభ్యులుగా హిందూపురం అసెంబ్లీ నియజకవర్గంలో కమతం కాటమయ్యలను నియమించారు.

ఆశావహుల్లో నిరాశ

నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకుని దక్కని వారిలో నిరాశే ఎదురైంది. గత ఎన్నికల సమయంలో టిక్కెట్టు ఆశించి దక్కనివారు, పార్టీ కోసం పనిచేసిన వారు పెద్దఎత్తున నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టికున్నారు. మొదటి జాబితాలో కేవలం ఒక్కరికి మాత్రమే నామినేటెడ్ ఛైర్మన్ పదవి దక్కింది. దీంతో ఇప్పటి వరకు పదవులొస్తాయని ఆశించిన వారిలో తీరని నిరాశే మిగిలింది. ప్రధానమైన కార్పొరేషన్ల అన్నింటినీ ప్రభుత్వం భర్తీ చేసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లోనే ఐదుగురికి టిక్కెట్టు దక్కని సీనియర్లు ఉన్నారు. వారు కూడా ఈ పదవుల్లో తమకు తగిన ప్రాధాన్యత లభిస్తుందని భావించారు. కాని వారెవరికీ చోటు లేకపోవడంతో నిరాశలోనున్నారు.

రథానికి నిప్పు

◆ మంటలను ఆర్పిన గ్రామస్తులు

◆ కణేకల్లు మండలం హనకనహాల్‌లో ఘటన

◆ గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ



కాలిపోయిన రథం



మంటల్లో కాలిన రథం ముందు భాగం

ప్రజాశక్తి -కణేకల్లు

అనంతపురం జిల్లా కణేకల్లు మండలం హనకనహాల్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి రామాలయం రథానికి మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు వెంటనే స్పందించి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనతో గ్రామంలో కాస్త అలజడి నెలకొంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... హనకనహాల్ గ్రామంలో రాముడు, ఆంజనేయస్వామి దేవాలయాలు ఉన్నాయి. ఇందులో దేవాదాయ పరిధిలో ఒక ఆలయం ఉండగా, మరొక ఆలయం ప్రయివేటు వ్యక్తుల నిర్వహణలో ఉంది. ఈ ఆలయాలకు సంబంధించి ఓ రథాన్ని అదే గ్రామానికి చెందిన ఒక కుటుంబ సభ్యులు 2022 సంవత్సరంలో రూ.18 లక్షల సొంత నిధులతో తయారు చేయించి ఇచ్చారు. అప్పటి నుంచి మూడు సంవత్సరాలు పాటు శ్రీరామనవమి సందర్భంగా రథోత్సవం వేడుకలను నిర్వహించారు. రథోత్సవం అనంతరం గ్రామంలోని ఆలయం వద్ద రథాన్ని ఉంచేందుకు ప్రత్యేకంగా ఓ షెడ్డును ఏర్పాటు చేసి అందులోనే రథాన్ని ఉంచేవారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి రథానికి నిప్పు అంటుకుని మంటలు వ్యాపించాయి. దట్టమైన మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు గుర్తించి వెంటనే ఆర్పివేశారు. అప్పటికే రథం ముందుభాగం కొంత కాలిపోయింది. ఏదైనా ప్రమాదవశాత్తు రథానికి మంటలు వ్యాపించాయా..? గ్రామంలో అలజడి సృష్టించేందుకు రథానికి గుర్తు తెలియిన వ్యక్తులు నిప్పుపెట్టారా..? గ్రామంలో నెలకొన్న ఘర్షణల కారణంగా ఈ ఘటన జరిగిందా..? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్, ఎస్పీ పరిశీలన

రథానికి నిప్పుపెట్టిన విషయం తెలుసుకున్న అనంతపురం కలెక్టర్ డా॥వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్‌లు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, ఆర్డీవో రాణి సుస్మిత, రూరల్ సిఐ వెంకటరమణ, ఎస్ఐ నాగమధు తహశీల్దార్ ఫణి కుమార్‌లతో కలిసి హనకనహాల్ గ్రామంలో పర్యటించారు. నిప్పుపెట్టిన రథాన్ని పరిశీలించారు. అక్కడే ఆలయం వద్ద గ్రామస్తులతో ఘటనకు సంబంధించి వివరాలను సేకరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రథానికి మంటల్లో కాలిన ఘటనపై సమగ్ర విచారణ చేస్తున్నామన్నారు. ఇందుకు కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కావాలనే ఎవరైనా రథానికి నిప్పుపెట్టి ఉంటే వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు.

ఘటనపై సమగ్ర విచారణ చేయాలి : సిపిఎం

హనకనహాల్ గ్రామంలో రామాలయ రథం కాలిపోయిన సంఘటనపై సమగ్ర విచారణ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ ఓ ప్రకటనలో కోరారు. సోమవారం అర్ధరాత్రి రథంకు మంటలు వ్యాపించినట్లు గ్రామస్తులు చెబుతున్నా రన్నారు. ఈ ఘటనకు ఎవరైనా పాల్పడి ఉంటే నిందితులను త్వరితగతిని పట్టుకోవాలన్నారు. ఈలోపు ఘటనపై దుష్ప్రచారాలు చేసే శక్తులు, వ్యక్తులను నియంత్రించాలని ఆయన కోరారు. ఎలాంటి ఉద్రిక్తతలకు లోనుకాకుండా ప్రజలు సంయమనం పాటించాలని సూచించారు.



కాలిపోయిన రథాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ఎలాంటి రాజకీయం లేదు : ఎమ్మెల్యే కాలవ

హనకనహాల్ గ్రామంలో రథం కాలిపోయిన ఘటనలో ఎలాంటి రాజకీయ కారణాలు లేవని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. మంటల్లో కాలిన రథాన్ని ఆయన పరిశీలించారు. ఘటనపై జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడామన్నారు. గ్రామస్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఈ ఘటనకు ఎవరైనా పాల్పడి ఉంటే వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలని అధికారులకు తెలిపామన్నారు.

అంగన్వాడీ సహాయక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న రెండు అంగన్వాడీ సహాయకుల పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రాజెక్టు సిడిపిఒ ఎఎల్ పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రాజెక్టు పరిధిలోని డి.హీరేహాల్ మండలం మురడి అంగన్వాడీ కేంద్రం-2లో 1 (ఎస్సీ), ఎస్ఆర్.కోట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో 1 (ఓసి) పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు ఫారాలను ఈనెల 25వ తేదీ నుంచి అక్టోబర్ 1వతేదీలోగా సిడిపిఓ కార్యాలయంలో అందజేసి రసీదు పొందాలని కోరారు.

కలెక్టరేట్లో ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

తన భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపిస్తూ సోమవారం ఉదయం అనంతపురం కలెక్టరేట్లో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తీవ్ర అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఈ రైతు మంగళవారం ఉదయం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కష్ణాపురం గ్రామానికి చెందిన రైతు సూర్యనారాయణకు సంబంధించి తన తండ్రి వారసత్వంగా 1.54 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి తనకు పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని పలుమార్లు రైతు మండల, జిల్లా రెవిన్యూ అధికారులు దష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. ఇదే సమస్యపై సోమవారం నాడు కలెక్టరేట్లో కలెక్టర్కు విజ్ఞప్తి ఇచ్చేందుకు రైతు సూర్యనారాయణ అనంతపురం కలెక్టరేట్ వద్దకు వచ్చాడు. అక్కడ కూడా తనకు న్యాయం జరగదన్న మనస్థాపనతో కలెక్టర్ కార్యాలయం ఆవరణలోనే ఆయన పురుగుల మందు తాగాడు. వెంటనే అక్కడున్నవారు స్పందించి అతన్ని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం రైతు మరణించాడు.

కుటుంబ సభ్యుల ఆందోళన

సూర్యనారాయణ మృతికి అధికారులే కారణం అంటూ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పట్టాదారు పాసు పుస్తకం సమస్యను పరిష్కరించాలని ఎన్నిమార్లు అధికారులకు మొరపెట్టుకున్న ఎవరూ పట్టించుకోలేదని, అందువల్లే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని ఆసుపత్రి వద్ద కన్నీటి పర్యవంతమయ్యారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

30న చలో కలెక్టరేట్ : సిఐటియు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్ కోరుతూ ఈనెల 30న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ తెలిపారు. మంగళవారం నాడు గణేనాయక్ భవన్‌లో చలో కలెక్టరేట్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ 2014 జూన్ ముందు నుంచి నేషనల్ హెల్త్ మిషన్ ఇతర వైద్య ఆరోగ్య పథకాల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, మెడికల్ కాలేజ్ సిబ్బంది, వివిధ వైద్య విభాగాల్లో వయోపరిమితి లిచ్చి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, కోపరేట్ సొసైటీ, మెడికల్ రెప్స్, సమగ్ర శిక్ష, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వెటర్నరీ, అగ్రికల్చర్, 108, 104, ఎలక్ట్రికల్, ఫారెస్ట్, ఎన్‌హెచ్‌ఎం తదితర రంగాల్లో పనిచేస్తున్న వారికి హెచ్‌ఆర్ పాలసీ, సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రైల్వే , ఆయిల్ గ్యాస్ సెక్టార్లు, బిఎస్ఎన్ఎల్, పోస్టల్ బ్యాంకింగ్ సెక్టార్‌లో సంవత్సరాల తరబడి ఎటువంటి ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. గురుకుల విద్యాలయాలలో అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న వారందరనీ రెగ్యులర్ చేయాలన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల్లోనూ టైం స్కేలు, కంటిజెంట్, పార్ట్ టైం, గెస్ట్, పీస్ రేట్, గౌరవ వేతనం తదితర నాన్ రెగ్యులర్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు సౌకర్యాలు అమలు చేయాలన్నారు. సమా పనికి సమాన వేతనం, ఈపీఎఫ్, ఈఎస్ఐ తదితర అన్నింటినీ వర్తింపజేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత తొలగించిన కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ 30న చేపట్టిన చలో కలెక్టరేట్లో జిల్లాలోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, జిల్లా ఉపాధ్యక్షులు మన్నెల రామాంజనేయులు, నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా దినసరి కూరగాయల మార్కెట్

అవకాశం ఉన్నా అవగాహన కొరవడటంతో సమస్యలు

రోడ్డుపై వ్యాపారాలతో మూసుకుపోయిన ప్రధాన ద్వారం.





మార్కెట్‌లో కూరగాయాల విక్రయాలు



వ్యర్థాల తొలగింపునకు ఉంచిన ట్రాక్టర్ ట్రాలీ పక్కనే పడేసిన కూరగాయల వ్యర్థాలు

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడపత్రి దినసరి కూరగాయల మార్కెట్‌ను ఎంతో దూర దృష్టితో ప్రత్యేకమైన వసతులు కల్పిస్తూ నిర్మాణాలు చేపట్టారు. పట్టణ వాసులకు సౌకర్యవంతంగా ఉండేలా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు వర్తకులకు స్థలాలు కేటాయించారు. కాలక్రమేనా మార్కెట్లో అడ్డదిడ్డమైన నిర్వహణ, కూరగాయల వ్యర్థాలు ఎక్కడికక్కడే నిలువ చేయడం లాంటి కారణాలతో అపరిశుభ్రత తాండవిస్తోంది. మార్కెట్ ప్రాంతం దుర్గంధం వెదజల్లుతూ మురికి కూపంలో మారింది. దీంతో కొనుగోలుదారులు అసౌకర్యాలకు గురవుతున్నారు. తాడిపత్రి పట్టణ వాసులకు సౌకర్యవంతంగా రాష్ట్రంలో గుర్తింపు తెచ్చేలా మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి ముందస్తు ఆలోచన మేరకు మోడ్రన్ కూరగాయల మార్కెట్ నిర్మాణం జరిగింది. అప్పట్లో మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన శివరామకష్ణ తాడిపత్రి పట్టణ సుందరీ కరణ, పచ్చదనం, పారిశుధ్యం విషయంలో రాష్ట్రం, దేశ స్థాయిలో అనేక అవార్డు సొంతం చేసురేనెలా గుర్తింపు తెచ్చారు. ప్రస్తుతం ఆయన మళ్లీ తాడిపత్రి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. ఇదే సమయంలో ఎమ్మెల్యేగా జేసీ.అస్మిత్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్‌గా జెసి.ప్రభాకర్ రెడ్డి ఉండడంతో పట్టాణాభివృద్ధి మరింత ముందుకు సాగుతుందనే చర్చ ప్రజల్లో నడుస్తోంది. పట్టణంలో అండర్ డ్రెయినేజీ, మురికి కాలువల పూడికతీత తదితర వాటిపై ఇప్పటికే ఎమ్మెల్యే పనులు చేపడుతున్నారు. ఇదే నేపథ్యంలో గాడి తప్పిన దినసరి కూరగాయల మార్కెట్లో పరిశుభ్రతకు ప్రాధాన్యతను ఇచ్చేలా చర్యలు తీసుకుంటారనే ఆశ ప్రజల్లో కన్పిస్తోంది.

మూసుకుపోయిన మార్కెట్ ముఖ ద్వారం

ప్రధాన ద్వారం వద్ద అమ్మకాలు చేస్తుండడంతో ప్రధాన రహదారి నుంచి మార్కెట్లోకి వెళ్లే దారి మొత్తం మూసుకుపోయింది. రైతుల, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయల వాహనాలు మార్కెట్‌లోకి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంది. చిరు వ్యాపారం ముసుగులో కొంతమంది బడా వ్యాపారులు రోడ్డును ఆక్రమిస్తూ రవాణాకు ఇబ్బందులు కల్పిస్తున్నారు.

కూరగాయల వ్యర్థాలతో దుర్వాసన

దినసరి కూరగాయల మార్కెట్లో అపరిశుభ్రతను తొలగించేందుకు మున్సిపాల్టీ ప్రత్యేకంగా ఓ ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసింది. అయితే కూరగాయల వ్యర్థాలను అందులోకి వేయకుండా రోడ్డుపై పారేయడంతో ఆ ప్రాంతం అంతా దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో కొనుగోలుదారులు మార్కెట్లో ఉన్నంత సేపు ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో మార్కెట్‌పై పూర్తిగా అవగాహన కలిగిన కమిషనర్ చొరవ చూపి అర్హత కలిగిన చిరు వ్యాపారులకు వారికి కేటాయించిన స్థలంలో వ్యాపారం నిర్వహించుకునేలా చర్యలు చేపట్టి, అపరిశుభ్రత లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కొనుగోలుదారులు అభిప్రాయపడుతున్నారు.



ద్రోన్ ద్వారా మందు పిచికారీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీత

సాంకేతికతతో పంటల సాగు

ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-ఆత్మకూరు

మారుతున్న కాలాగుణంగా వ్యవసాయానికి సాంకేతికతను జోడించి పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత వ్యవసాయ అధికారులకు తెలియజేశారు. ఆత్మకూరు మండలం ముట్టాల గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మతో కలిసి పాల్గొన్నారు. కంది పొలంలో డ్రోన్ ద్వారా పురుగుల మందు పిచికారి చేసే విధానాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. వ్యవసాయ అధికారులను రైతుల దగ్గరకే పంపించి పంట సాగులో మెలకువలు తెలియజేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమం ద్వారా ఇలాంటి కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. నూతన వ్యవసాయ పద్ధతులు, యంత్ర పరికరాలు, ప్రకతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ రవి, తహశీల్దార్ లక్ష్మి నాయక్, ఎంపిడిఒ శివ శంకర్, ఏవో సుచరిత, శంకర్ లాల్, రాకేష్ నాయక్, ఎఇఒ సుజిత పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ

ఉరవకొండ : వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల, వజ్రకరూరు గ్రామాల సర్పంచులు మల్లెల జగదీష్, మోనాలిసా ఆధ్వర్యంలో ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న సబ్సిడీ విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కళ్యాణి, టిడిపి మైనారిటీ మండల నాయకులు వలి, మన్యం రామాంజనేయులు, రాధ, రైతులు పరమేష్, ఓబిరెడ్డి, రామచంద్ర, రామాంజనేయులు, పుల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ సీతారాం ఏచూరికి నివాళి

ప్రజాశక్తి-గుత్తి

కమ్యూనిజానికి తన జీవితాన్ని అంకితం చేసిన కామ్రేడ్ సీతారాం ఏచూరి స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని సిపిఎం పట్టణ కార్యదర్శి వి.నిర్మల పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణ శివారులో ఉన్న జెడ్.వీరారెడ్డి కాలనీలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రజా సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తూ భవిష్యత్తు తరానికి స్ఫూర్తిని ఇచ్చారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, నాయకురాలు రేవతి,కవిత, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, సిఐటియు నాయకురాలు శ్యామల, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు వెంకటలక్ష్మి, జయమ్మ, లక్ష్మిదేవి, తదితరులు పాల్గొన్నారు.



ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

దసరాకు రాయదుర్గం మీదుగా ప్రత్యేక రైళ్లు

రాయదుర్గం : విజయదశమి దసరా పండుగ పురస్కరించుకుని బెంగళూరు నుంచి రాయదుర్గం మీదుగా విజయపుర నగరానికి ప్రత్యేక రైలు సర్వీసులను నడపనున్నట్లు నైరుతి రైల్వే ముఖ్య సమాచార అధికారి మంజునాథ్ కనమడి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైన్ నెంబర్ 06501 ప్రత్యేక దసరా రైలు బెంగళూరులోని సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య టర్మినల్ (ఎస్ఎంవిటి) స్టేషన్ నుంచి అక్టోబర్ 9, 12వతేదీల్లో బెంగళూరు నుంచి సాయంత్రం 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 2:20కు రాయదుర్గం స్టేషన్,ఉదయం 10:30కు విజయపుర స్టేషన్ చేరుతుందన్నారు. అలాగే ట్రైన్ నెంబర్ 06502 విజయపుర స్టేషన్ నుంచి ఆది, గురువారాల్లో సాయంత్రం గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 2-28కి రాయదుర్గం, ఉదయం 11:15కు బెంగళూరు ఎస్ఎంవిటి స్టేషన్‌కు చేరుతుందన్నారు. ఈ ప్రత్యేక రైలు మార్గమధ్యంలో చిక్కబాణావర, తుమకూరు, అరసికేరే, బీరూరు, చిక్క జాజురీరు, చిత్రదుర్గ, రాయదుర్గం, బళ్లారి కంటోన్‌మెంట్, తోరనగల్లు, హోసపేట, కొప్పల్, గదగ్, హోలే ఆలూరు, బాదామి, బాగల్కోట్, ఆల్మట్టి, బసవన బాగేవాడి రోడ్డు, ఇబ్రహీం పుర స్టేషన్లో వద్ద ఈ రైలు ఆగుతుందన్నారు.

2023 ఖరీఫ్, రబీ బీమా ప్రకటించాలి

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

అనంతపురం కలెక్టరేట్ : 2023 ఖరీఫ్, రబీ బీమా ప్రకటించాలని, అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20వేలు ఇవ్వాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2023 ఖరీఫ్‌లో 28, రబీలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినా కరువు సహాయక చర్యలు చేపట్టలేదన్నారు. కావున రైతులను ఆదుకోవడానికి 2023 ఖరీఫ్, రబీ బీమా ప్రకటించి రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెట్టుబడి సాయం రూ.20వేలు ఇవ్వాలని, వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మోటార్ల బిగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, 22 జీవో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కారం కోరుతూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు పెద్దసంఖ్యలో ధర్నాకు తరలివచ్చి విజయవతం చేయాలని పిలుపునిచారు.

మూడునెలలకోసారి రక్తదానం చేయాలి

జెఎన్‌టియు ప్రిన్సిపల్ పి.చెన్నారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరూ తమ రక్త గ్రూపు నిర్ధారణ చేసుకుని ఆపదలో ఉన్న వారికి ప్రతి మూడు నెలలకు ఓసారి రక్తదానం చేయాలని అనంతపురం జెఎన్‌టియూ ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపల్ పి.చెన్నారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ స్థాపన దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్-3, మానవత బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రక్త నిర్ధారణ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వారి బ్లడ్ గ్రూపు తెలుసుకోవాలన్నారు. అంతేగాకుండా రక్తదానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి మూడునెలలకోసారి రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు రక్తదానంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సాయంత్రం ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ జి.మమత ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో మానవత బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ కన్వీనర్ డాక్టర్ అమరనాథ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, ఎన్ఎస్-ఎస్ కోఆర్డినేటర్ జి.మమత, మానవత సంస్థ కన్వీనర్ సలీమ్ అలీ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, కళాశాల విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రక్తగ్రూపు నిర్ధారణకు శాంపిల్స్ సేకరిస్తున్న వైద్యసిబ్బంది

మన్నీల వద్ద ఆర్టీసీ బస్సులు ఆపాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎస్కెయు సమీపంలోని మన్నీల గ్రామం వద్ద ఆర్టీసీ బస్సులను ఆపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్దు, సిటీయు జిల్లా ఉపాధ్యక్షులు మల్లేల రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం నగరంలోని ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మవరం నుంచి అనంతపురం వచ్చే పల్లెవెలుగు బస్సు మన్నీల గ్రామంలో ఆపాలని విద్యార్థులు వేడుకుంటున్నా డ్రైవర్ ఆపడం లేదన్నారు. దీంతో విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు సమయానికి వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున తక్షణమే స్పందించి మన్నీల వద్ద ఆర్టీసీ బస్సులు ఆపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి భీమేష్, టి.పరమేష్, రవితేజ, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

యువత సేవాభావాన్ని అలవర్చుకోవాలి

జాతీయ సేవాదినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

విద్యార్థుల్లో స్ఫూర్తి వంతమైన కార్యక్రమాల్లో ఒకటి ఎన్ఎస్ఎస్ అని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సేవా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక భావన రేకెత్తించేలా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. తెలిసిన గ్రామాల్లో సామాజిక అలవాట్లు, మనుషుల నడవడిక కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. మంచి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలనే భావన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, పరిష్మా, పాలరాజు, వెంకటేష్, గోవర్ధన్, ప్రశాంత, షరీఫ్, చంద్రశేఖర్, నాగమణి, లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ఉరవకొండ : యువత సేవాభావాన్ని అలవర్చుకుని ముందుకు సాగాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి దైనందిన జీవితంలో సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలని సూచించారు. అధ్యాపకుల సూచనలు, సలహాలు పాటించి కళాశాల, తల్లిదండ్రులు, పుట్టిన ఊరికి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు భాదర్, అధ్యాపకులు ప్రసాద్, ఒకేషనల్ అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ మల్లికార్జున పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో జాతీయ సేవా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమాజ సేవలో ప్రతి విద్యార్థి భాగస్వాములు కావాలన్నారు. దేశభక్తితో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత ప్రజాసేవ తదితర అంశాలపై చిన్నతనం నుంచి మక్కువ చూపాలన్నారు. మానవసేవే మాధవసేవ అనే నాలుడితో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జగన్నాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయాన్ని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. తర్వాత మండల సర్వసభ్య సమావేశం ఎన్ని రోజులకు ఒకసారి నిర్వహిస్తారు.. ఎవరెవరు పాల్గొంటారు.. ఏఏ అంశాలు చర్చిస్తారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఇంతవరకు ఉపాధి హామీ పనులు ఎన్ని రోజులు జరిగాయి.. నీటి సంరక్షణ కోసం ఏం చేస్తున్నారు.. ఎంతమంది కూలీలు ఉన్నారనే విషయాలను ఎపిఒ ఎర్రమ్మను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలో జరుగుతున్న స్వచ్ఛత హి సేవ కార్యక్రమలపై విచారించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దివాకర్, తహశీల్దార్ అరుణకుమారి, ఇఒఆర్‌డి శైలజారాణి, మండల విద్యాధికారి కృష్ణయ్య, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఉమాదేవి, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనర్సింహులు, ఎపిఒ ఎర్రమ్మ, సీనియర్ అసిస్టెంట్ నూర్ మొహమ్మద్, జూనియర్ అసిస్టెంట్ నరేంద్ర, టైపిస్ట్ ఆనంద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వినూత్న

తహశీల్దార్ కార్యాలయం తనిఖీ



తహశీల్దార్ కార్యాలయాన్ని మార్చాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న టిడిపి నాయకులు

బెలుగుప్ప : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు. విషయం తెలుసుకున్న టిడిపి మండల నాయకులు మల్లికార్జున, పెద్ద తిప్పయ్య ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం మార్చాలని తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఎంపిపి పెద్దన్న, టిడిపి నాయకులు కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షర్మిల, ఎంపిడిఒ రామచంద్ర, డిప్యూటీ తహశీల్దార్ హుస్సేన్‌పీరా, ఆర్ఐ నగేష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ శర్మ, వీఆర్వోలు ఎర్రిస్వామి, రాజశేఖర్, నగేష్, ఎర్రిస్వామి, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: GOOTY
I.A.267/2023 IN O.S. 193/2017

Between:
Marthadu Nazeer Hussain ...Petitioner /Plaintiff
AND
Smt.P.Krishnaveeni ...Respondent/Defendant

NOTICE TO THE RESPONDENT

To,
Smt. P.Krishnaveni W/o. P.Prabhakar
D.No. 7/1384 , Gooty town and Mandal.
Anantapur District.

The above petitioner filed petition to pass final decree in the terms of the preliminary decree against you. The petition posted on 03.10.2024 for your appearance . Hence please take notice and appear on 03.10.2024 at 10.30 AM in person or your pleader to file answer if any. Otherwise case will be decided on merits .

(By Court order)
S.RAJJAB VALI,
ADVOCATE FOR PETHIONER
Cell No.9866724061

IN THE COURT OF THE SECOND ADDITIONAL DISTRICT JUDGE OF KURNOOL AT ADONI
A.S. 69 OF 2018

Between:-
1. Priyanka
2. Sreedhar Reddy .... APPELLANT

VERSUS

1. N.Savithramma
2. N.Hanumanthamma
3. N.Jayamma
4. N.Sreenivasa Reddy
5. N.Bheema Reddy
6. A.C.Mahendra Reddy died by lrs.
7. Premavathi (died by lrs.)
8. N.Vijay Lakshmi alias Anantha Lakshmi alias Anatha Lakshmi
9. M.S.Fayaz .... RESPONDENTS

NOTICE

To,
Respondent No.8
N.Vijaya Lakshmi alias Ananatha Lakshmi w/o Late Srinivas Reddy, Hindu, aged about 30 years, R/o Jakkaladiki, Kanekan Mandal, Anantappur Dist. ....Defendants
Madam,

Appellants have filed the above appeal against decree and judgment in O.S.238/2006 on the file of Principal Junior civil Judge court, Adoni in respect of suit schedule property. Take notice that honorable court has ordered substitute service of summons to you. You have to appear before the above mentioned court on 30.9.2024 at 10.30 am, either personally or through your advocate and file objections if any. Otherwise the appeal will be decided in your absence.

C. GIRIDHAR
Advocate for Appellants
Adoni, Kurnool Dist.

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు

'ఇది మంచి ప్రభుత్వం'లో నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడంతోనే 'ఇది మంచి ప్రభుత్వం'కు సార్థకత అని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బి బంగ్లా వద్ద ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మొక్కలు నాటారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమం అభివృద్ధి పనులను వివరించారు. గుత్తికి నీటి సమస్య ఉందని త్వరలోనే నీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని గుత్తి, గుంతకల్లు,పామిడి మండలాల్లోని చెరువులకు కృష్ణాజలాల తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు జి.వెంకట శివుడుయాదవ్, జనసేన నియోజకవర్గ బాధ్యులు వాసగిరి మణికంఠ, ప్రత్యేకాధికారి నరసింహారావు, తహశీల్దార్ ఓబులేసు, ఎడిఎ వెంకటరాముడు, టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణ, పట్టణ, మండల కన్వీనర్లు ఎంకె.చౌదరి, బర్దివలి, నాయకులు కోనంకి కృష్ణ, సి.లక్ష్మణ్‌చౌదరి, సొలమాన్‌రాజ్, బి.వేణుగోపాల్, చికెన్ శీనా, బి.రమేష్, గోరంట్ల నాగరాజు, పి.సుధాకర్, టి.సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు మంగళవారం మండల పరిధిలోని లోలూరు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పథకాలను వివరిస్తూ కరపత్రాలను అతికించారు. తర్వాత ప్రభుత్వం నుంచి పంచాయతీలకు మంజూరైన నాలుగు ట్రాక్టర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పిఎల్.ఈశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, నాయకులు అమ్మలదిన్నె శాలిని, చితంబరిదొర, దండు శ్రీనివాసులు, దేగల కృష్ణమూర్తి, చిదానందనాయుడు, అట్టే రామాంజనేయులు, కాయల రమణయాదవ్, డ్రిప్పు ఓబులేసు, మసూద్‌వలి, బండి వెంకటనారాయణ, కాయగూరల సత్తి, మాసూల్ చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : అనంత నగరాభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం నగరంలోని లక్ష్మీనగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగరాజు, తహశీల్దార్ హరికుమార్, నాయకులు ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, గాజుల ఆదెన్న, సందిరెడ్డి శ్రీనివాసులు, లలిత్‌కుమార్, సుధాకర్‌నాయుడు, కొండవీటి భావన, చేపల హరి, చేపల ఆనంద్, అహ్మద్, విశాలాక్షి, సంగా తేజస్విని, కుంచెపు వెంకటేష్, మోహన్‌కుమార్, పోతుల లక్ష్మీనరసింహ, తాజుద్దీన్, వడ్డే భవాని, కడియాల కొండన్న, తదితరులు పాల్గొన్నారు.



శింగనమల మండలంలో ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

రాయదుర్గం : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వానికి ప్రజలు చేదోడు వాదోడుగా ఉండాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. మంగళవారం పట్టణంలోని వారపుసంత మైదానంలో మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి అధ్యక్షతన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జగన్ చేసిన పాపాలు, నష్టాలు, అనుభవం లేని జగన్ ఐదేళ్ల పాలనతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16,437 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీకి తొలి సంతకం చేశారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశారన్నారు. సామాజిక పింఛన్లను పెంచారన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు ప్రశాంతి, మాజీ సభ్యులు నాగమణి, నాయకులు తిప్పేస్వామి, శంకర్, పురుషోత్తం, బళ్లారి జ్యోతి, నల్లపూల వెంకటేశులు, భారతి, ధనార్జన, కృష్ణమూర్తి, నాగరాజు, ఇనాయత్ బాషా, రాజశేఖర్, ప్రవీణ్, ఉస్మాన్, మెప్మా టిఎంసి నారాయణరెడ్డి, చేనేత గార్మెంట్స్ కార్మికులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని గోవిందవాడ గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బలరామిరెడ్డి, నాయకులు గోనేహాల్ కేశవరెడ్డి, కొత్తపల్లి మల్లికార్జున, గోవిందవాడ సోమనాథ్‌గౌడ్, వన్నూరు, కేశప్ప, తహశీల్దార్ మునివేలు, ఎంపిడిఒ షకీల, మండల విద్యాధికారి ఈరన్న, ప్రధానోపాధ్యాయులు సూర్యుడు, ఎస్ఐ నబిరసూల్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని ముట్టాల, పాపంపల్లి గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పరిటాల



గుత్తిలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు, టిడిపి నాయకులు

సునీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే పలు అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రభుత్వానికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీనాయక్, అగ్రికల్చర్ ఏవో సుచరిత, టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు వడ్డపల్లి నారాయణస్వామి, శశాంక్‌బాబు, బోదపాటి హరి, గ్యాస్ సీన్స్ కందల ఓబుళపతి, పూల ఓబుళపతి, అంకే ఆనంద్, గుజ్జల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని కోనాపురం గ్రామంలో సర్పంచి మల్లెల వనిత అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పథకాలను, అభివృద్ధిని వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో పెంకుల మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి అనిత, మాజీ ఎంపిటిసి కరేగౌడ్, టిడిపి నాయకులు కురుగౌడ, అక్కన్న, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఓబులేసు, డీలర్ నల్లమల్ల, హనుమంతు, రామచంద్రప్ప, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక అంబేద్కర్ కాలనీ సచివాలయం పరిధిలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను అతికించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఎద్దులపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ ఈశ్వరయ్య, భరత్ సాయిరెడ్డి, ఇందిర, అంగన్వాడీలు జెఎల్ నారాయణమ్మ, జ్యోతి, మహిళా పోలీస్ రాధా, ఏఎన్ఎం సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : ప్రత్యేక అధికారి రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వందరోజుల కూటమి ప్రభుత్వం చేసిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒ వీరరాజు, మండల విస్తరణ అధికారి విజయశేఖర్ నాయుడు, విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బొమ్మనహాల్ మండలంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

'పివికెకె'లో ఎఫ్‌డిపి శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

పివికెకె ఐటీ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఇసిఇ) విభాగం, జెఎన్‌టియుఎ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎఫ్‌డీసీ)తో కలిసి 'ఏఐ ఇంటిగ్రేటెడ్ గ్రీన్ వైర్‌లెస్ కమ్యూనికేషన్ అండ్ సెన్సార్ టెక్నాలజీస్'పై ఐదురోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డిసి డైరెక్టర్ ప్రొఫెసర్ జి.ప్రశాంతి మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న రంగంలో తాజా పరిణామాలను అన్వేషించడానికి ఈ ఎఫ్‌డీపీ ఫ్యాకల్టీ సభ్యులకు ఒక అద్భుతమైన వేదికగా ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఫాకల్టీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐఎస్ ఛైర్మన్ డాక్టర్ పల్లె కిషోర్, ప్రిన్సిపాల్ బి.రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్, ఎఫ్‌డీపీ కోఆర్డినేటర్ పి.దీప్తి జోర్దానా, మేనేజ్‌మెంట్ ప్రతినిధి కె.శ్రీకాంత్‌రెడ్డి, ఇసిఇ విభాగాధిపతి ఎంవి.శ్రీరాజ్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన అతిథులు

జీవో 85ని రద్దు చేయాలి

కొనసాగిన డాక్టర్ల ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 85ని రద్దు చేయాల్సిందే అని వైద్యులు డిమాండ్ చేశారు. సంబంధిత జీవోను రద్దు చేయాలని కోరుతూ జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొద్దిరోజుల నుంచి చేపట్టిన ప్రభుత్వ వైద్యుల నిరసన మంగళవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైం బాండ్ ట్రైబల్, ప్రమోషన్లు, ట్రైబల్, ఎఫ్‌డిపి అలవెన్స్ ఇవ్వాలని, 2020 బ్యాచ్ నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ నారాయణస్వామి, వైద్యులు రాజేష్, మనోజ్, మహేంద్ర, శంకర్‌నాయక్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న డాక్టర్లు

పుట్లూరు హౌసింగ్ ఎఇగా సంధ్యారాణి

పుట్లూరు : పుట్లూరు హౌసింగ్ ఎఇగా సంధ్యారాణి మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న లోకేష్‌కుమార్ యాడికి మండలానికి బదిలీ కాగా, పెద్దపప్పూరు మండలంలో విధులు నిర్వహిస్తున్న సంధ్యారాణి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కళ్యాణదుర్గం : దివంగత మాజీ ఎమ్మెల్యే టిసి మారెప్ప కుటుంబాన్ని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు టిసి సురేష్‌కు రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, కరణం రామ్మోహన్‌చౌదరి, లక్ష్మీనారాయణ, వైపి.రమేష్, గొల్ల వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

'నెట్టికంటి' ఆలయ ఇఒగా కె.వాణి



గుంతకల్లు రూరల్ : సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఆలయ ప్రధాన అధికారిణిగా కె.వాణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా ప్రధాన అర్చకులు, వేద పండితులు, ధర్మకర్తల మండలి సభ్యులు మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

వెలుగు ఎపిఎంగా గుణశ్యామ్



గుంతకల్లు రూరల్ : నూతన ఎపిఎంగా స్థానిక వెలుగు కార్యాలయంలో గుణశ్యామ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా వజ్రకరూరు మండలంలో విధులు నిర్వహిస్తున్న ఈయన గుంతకల్లుకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వీరస్వామి తాడిపత్రికి బదిలీ అయ్యారు.

'స్వర్ణాంధ్ర 2047'పై అవగాహన

పుట్లూరు : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. అలాగే ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కడవకల్లు, పుట్లూరు, తదితర గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో తహశీల్దార్ శేషారెడ్డి, సహాయ గణాంక అధికారి విజయకుమార్, డిఆర్‌డిఎ ఎపిఎం వెంకట్రామిరెడ్డి, ఉపాధి హామీ పథకం ఎపిఒ చెన్నకేశవులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుత్తి ఉప కారాగారం తనిఖీ

గుత్తి : పట్టణంలోని ప్రత్యేక ఉప కారాగారాన్ని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి జి.శివప్రసాద్ యాదవ్ మంగళవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కారాగారంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం ఉపకారాగారం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథచారితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వి.మహేశ్వరుడు, న్యాయవాదులు వీసీ.గంగాధర్ కుమార్, ఎ.సూర్యనారాయణ, కోర్టు టైపిస్టు సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంక్షేమ సంఘం డైరెక్టర్‌గా లక్ష్మీనరసింహులు



అనంతపురం : తొలి విడత నామినేటెడ్ పోస్టుల్లో పద్మశాలి సంక్షేమ సంఘం డైరెక్టర్‌గా టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పోతుల లక్ష్మీనరసింహులును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తొలి విడత నామినేటెడ్ పదవుల్లోనే తనకు పద్మశాలి సంక్షేమ సంఘం డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన సిఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ వైద్యశాలలో ఐరన్ గ్రిల్ ఏర్పాటు

గుత్తి : ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సల నిమిత్తం వచ్చే వారి సౌకర్యార్థం ఆర్ఎంపీ వైద్యులు వద్ది నాగేంద్ర ఐరన్ గ్రిల్‌ను ఏర్పాటు చేశారు. తన తల్లితండ్రులు వద్ది పద్మావతి, డాక్టర్ వద్ది చిన్న కొండయ్య జ్ఞాపకార్థం డాక్టర్ వద్ది నాగేంద్ర సొంతంగా రూ.35వేలు వెచ్చించి పీపీ యూనిట్ ఎదురుగా, మెటికలకు ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేశారు. దీంతో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ యల్లప్ప, నర్సులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారంపై పోరాటాలు


గుత్తి : పట్టణ శివారులోని జెడ్.వీరారెడ్డి కాలనీలో మంగళవారం సిపిఎం మండల శాఖ సమావేశం నిర్వహించారు. ముందుగా సిపిఎం సీనియర్ నాయకురాలు డి. పద్మావతమ్మ సిపిఎం జెండాను ఆవిష్కరించారు. తర్వాత సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటాలు గురించి సభలో తీర్మానం చేశారు. అలాగే జెడ్.వీరారెడ్డి కాలనీ లో మౌలిక సదుపాయాలు, అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, స్టోర్ ఏర్పాటు కోసం మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చేపట్టే పోరాటాలు గురించి నాయకులు చర్చించారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాల అందజేత

బ్రహ్మసముద్రం : చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను ఆయా పాఠశాలలకు అందజేసినట్లు జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ చనమలప్ప తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం మండల పరిధిలోని 50 పాఠశాలకు ప్రశ్నపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను మూఢవిశ్వాసాలకు దూరం చేయాలన్న లక్ష్యంతోనే టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీటీ ఇబ్రహీం, టీచర్లు హనుమంతురెడ్డి, తిప్పేస్వామి, చైతన్య, హనుమన్న, మహిళా ఉపాధ్యాయురాలు అర్చన, సంగీత, సుమంగళి, స్వర్ణలత, అనిత, విజయలక్ష్మి, అసీనాభాను, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూఫెర్రర్‌కు సన్మానం

అనంతపురం : జాతీయ స్థాయిలో మూడు వారాలపాటు దులీప్ ట్రోఫీ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూఫెర్రర్‌ను ఎల్ఆర్‌జి పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఆర్‌జీ పూర్వ విద్యార్థుల సంఘం నాయకురాలు వసుంధర, పూర్వ విద్యార్థులు, బిజెపి రాష్ట్ర నాయకులు లలిత్‌కుమార్, టీచర్ సునీత, సినీయాక్టర్, షార్ట్ ఫిలింమేకర్ రంజిత్, ఫైనాన్షియర్, లక్ష్మీప్రసాద్, హర్షద్ జైన్, వి.ఎం.రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.



మాంఛూ ఫెర్రర్‌ను సన్మానిస్తున్న ఎల్ఆర్‌జి పూర్వ విద్యార్థులు

నేరాలు ఘోరాలు

రైలు నుంచి కిందపడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గుత్తి : జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తురకపల్లి రోడ్డులో సోమవారం రాత్రి రైలులో నుంచి కింద పడి వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రంలోని యాదగిరి జిల్లా కనేకల్‌కు చెందిన మల్లికార్జున (28) బెంగుళూరులో భవన నిర్మాణపు పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. ఈనెల 22న తన సోదరితో కలిసి రైలులో కనేకల్లుకు వెళ్లాడు. సోదరిని తమ స్వగ్రామంలో వదిలి తిరిగి వెళ్తుండగా గుత్తి పట్టణంలోని తురకపల్లి రోడ్డులో రైలు బోగి తలుపు వద్ద నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెంది ఉంటాడని తెలిపారు. విషయం తెలుసుకున్న సివిల్ సీఐ బి.వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తర్వాత జీఆర్పీ ఎస్ఐ నాగప్పకు సమాచారం అందించారు. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు మల్లికార్జున మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. ఘటనపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



యల్లనూరు మండలంలో మాట్లాడుతున్న అధికారులు

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయండి

యల్లనూరు : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంపై అసిస్టెంట్ ఇంజనీర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 28న జరగబోయే మన ఇళ్లు-మన గౌరవంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వీరరాజు, తహశీల్దార్ నాగరాజు, ఇఒఆర్‌డి విజయశేఖర్ నాయుడు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని ఎంపిడిఒ దాసానాయక్ సూచించారు. 'మన ఇల్లు.. మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనాథ్, హౌసింగ్ ఇంజనీరింగ్ రామ్మోహన్, ఎపిఎం నీలామణి, సీసీ దొనతిమ్మ, ఆర్ఐ శ్రీనాథ్, ఇన్‌ఛార్జి ఎపిఒ అవినాష్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురంలోని పెద్దాసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు, ప్రవాస భారతీయులు కల్లమడి రవీంద్రనాథ్, సతీమణి రమాదేవి కుమార్తె సుచరిత పుట్టినరోజును పురస్కరించుకుని అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సౌధామణి, నబీరసూల్, ఓబుళపతి, కిష్టప్ప, మణిదీప్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి లడ్డు వివాదంపై విచారించాలి

అనంతపురం : తిరుపతి లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసినట్లు వచ్చిన ఆరోపణలపై సుప్రీంకోర్టు జడ్జి పర్యవేక్షణలో విచారణ జరగాలని వైసిపి ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి భక్తుల్లో అందోళన కలిగించేలా సీఎం చంద్రబాబు మాట్లాడడం సరికాదన్నారు. వైసిపిని హిందూ వ్యతిరేక పార్టీగా ముద్ర వేసేందుకు కుటిల ప్రయత్నమే లడ్డు వివాదం అన్నారు. చంద్రబాబు వేసిన ఐజీ స్థాయి అధికారి విచారణలో వైసిపి నాయకులను ఇరికించేలా కుట్రకోణం తప్పితే నిజానిజాలు వెలుగులోకి రావని అందోళన వ్యక్తం చేశారు. నిష్పక్షపాతంగా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్య కేంద్రానికి ఫ్యాన్ వితరణ

పామిడి : స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి 7 వార్డు మాజీ కౌన్సిలర్ వై.యు.రామాంజనేయులు ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీ యుగంధర్ మంగళవారం ఫ్యాన్‌ను వితరణ చేశారు. ఈమేరకు ఆసుపత్రి ఇన్‌ఛార్జి డాక్టర్ శివకార్తీక్‌రెడ్డికి ఫ్యాన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామాంజినేయులు, జింకల రామకృష్ణ, మస్తాన్, యుగంధర్, శివారెడ్డి, నందకిషోర్, తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రికి ఫ్యాన్‌ను వితరణ చేస్తున్న నాయకులు

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

వ్యవసాయాన్ని లాభసాధిగా మార్చడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. మంగళవారం చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను పోస్టర్లను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలు తెలుసుకోవడంతోపాటు సాగులో తగిన మెళకువలు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ గురుప్రసాద్, ఎఒ జగదీష్, నాయకులు మోరేపల్లి మల్లికార్జున, మాజీ వైస్ ఎంపిపి ఎర్రిస్వామి, హనుమంతురెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అనంతపురం : జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి ఎకరాకూ ఈక్రాప్ నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ సంబంధిత వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇటుకలపల్లి, ఎ.నారాయణపురం రైతు సేవాకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవడంతోపాటు ఇకెవైసిని పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల వ్యవసాయ అధికారులు శశికళ, సిరికల్చర్ అధికారి ఓబులేసు, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ టెక్నికల్ ఎఒ రాకేష్‌నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారి మురళీకృష్ణ, గ్రామ ఉద్యాన శాఖ సహాయకులు హేమా, పావని, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : వ్యవసాయంలో మంచి దిగుబడులు రావాలంటే సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఎఒ పృథ్వీసాగర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని సీర్పి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి రమేష్‌బాబు, సర్పంచు లలితమ్మ, నాయకులు సునీల్, శశిభూషణ్, జయరాములు, ఎర్రిస్వామి, అగ్రికల్చర్ అసిస్టెంట్ హనుమంతరాయుడు, వెటర్నరీ అసిస్టెంట్ సుదర్శన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల పరిధిలోని 85 నిట్టూరు గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో

జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు

పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు వ్యవసాయ పద్ధతులు, పురుగు నివారణ చర్యలు, వాటి సస్యరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండల పరిధిలోని కోటంక, మర్తాడు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పి.సోమశేఖర్ వ్యవసాయ, ఉద్యానవన శాఖలో ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, ప్రకృతి వ్యవసాయం, సూక్ష్మ సేద్య పరికరాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఇఒ రామాంజనేయులు, ఎపిఎంఐపి సిబ్బంది సుశీలమ్మ, రైతులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని నడిమిదొడ్డి, నాయనపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి చెన్న వీరస్వామి పంటల సాగుపై అవగాహన కల్పించారు. తర్వాత పంటలను పరిశీలించి రోగాల నివారణకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయనపల్లి సర్పంచి మల్లేశ్వరి, రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శశికళ, మండల వ్యవసాయ అధికారి చెన్న వీరస్వామి, మండల పశు వైద్యాధికారి గోవిందరాజులు, ఎపిఎంఐపి విభాగానికి చెందిన మైక్రో ఇంజనీరింగ్ శివశంకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ప్రభుత్వం అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ అన్నారు. మంగళవారం విడపనకల్ మండల పరిధిలోని ఉండబండ, చీకులగురికి, ఉరవకొండ మండల పరిధిలోని షేక్షానిపల్లి, లత్తవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా కందిపొలాన్ని సందర్శించి ఆకు తొలిచే పురుగు



ఉరవకొండలో పాల్గొన్న అధికారులు



కళ్యాణదుర్గంలో పొలంబడి పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ఆశించినట్లు గుర్తించారు. తర్వాత నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం ఎడిఎ శైలకుమారి, మండల వ్యవసాయాధికారులు పెన్నయ్య, శుభకర్, ఎపిఎంఐపి ఎపిడి ఫిరోజ్‌ఖాన్, హెచ్ఒ నెట్టికంటయ్య, ఎఇఒ రాఘవేంద్ర, రైతు సేవాకేంద్రాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని సోమనపల్లి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు ఈ పంట నమోదు, ఇకెవైసి, పిఎం కిసాన్, మైక్రోనుట్రెంట్స్, ఎరువుల వాడకంపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారిణి ఉమాదేవి, వెటర్నరీ వైద్యులు, సచివాయల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని పసలూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహంచారు. వ్యవసాయ శాఖ అధికారులు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, సర్పంచి కల్పన, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌సుందర్‌రెడ్డి, టిడిపి నాయకులు బుల్లే నారాయణస్వామి, మాజీ సర్పంచులు రామకృష్ణారెడ్డి, వెంకట్రాముడు, లక్ష్మీనారాయణరెడ్డి, ఈరప్ప, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని బైరిసముద్రం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహినంచారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి సరిత మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సాగు పద్ధతులను రైతులకు వివరించేందుకే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రత్యేక అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎస్‌కెయు ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కొనసాగిన 'స్వచ్ఛత హి సేవ'

అనంతపురం : ఎస్‌కెయు కాలేజీ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో స్థానిక ఆకుతోటపల్లి గ్రామంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పరిసరాల పరిశుభ్రత, రోగాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సి.గురుప్రసాద్, ఎంపిపి విద్యాలయం ప్రధానోపాధ్యాయుడు జి.తిమ్మారెడ్డి, ఎన్ఎస్ఎస్ పిఒ పి.సత్యసౌమ్య, సచివాలయం సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

నార్పల : స్వచ్ఛత హి సేవ 2024లో భాగంగా మండల వ్యాప్తంగా నీటి వృథా వల్ల కలిగే నష్టాలు, ఇంకుడు గుంతల ప్రాముఖ్యతపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దివాకర్, ఇఒఆర్‌డి శైలజారాణి, మండల విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఉమాదేవి, ఎపిఒలు రమేష్, రామారావు, ఎర్రమ్మ, సీనియర్ అసిస్టెంట్ నూర్ మొహమ్మద్, జూనియర్ అసిస్టెంట్ నరేంద్ర, టైపిస్ట్ ఆనంద్, పంచాయతీ కార్యదర్శులు చరణ్, పరుశురాం, శ్రీనివాసులు, లక్ష్మేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఐసిడిఎస్ సిడిపిఒ ఉమాశంకరమ్మ

ప్రజాశక్తి-శింగనమల

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసిడిఎస్ సిడిపిఒ ఉమాశంకరమ్మ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత, పిల్లల ఎదుగుదల, కాండ్లి మెంటరీ ఏ కింగ్, ఆహారంలో వైవిధ్యత గురించి వివరించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ ఆకుకూరలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగమణిమ్మ, సూపర్‌వైజర్లు కౌసల్య, ధనలక్ష్మి, ఉమాదేవి, వాణిశ్రీ, హేమలత, భారతి అన్నపూర్ణాదేవి, జ్యోతి, అంగన్వాడీలు, తల్లులు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : మండల పరిధిలోని కెపి.దొడ్డి అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పౌషకాహార మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సరస్వతి మాట్లాడుతూ గరిభ్రణులు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు యల్లమ్మ, సరస్వతి, గీత, గాయత్రి, తులసి, ఆయాలు సరోజ, ఈరమ్మ, భూలక్ష్మి, ఆశావర్కర్ తిప్పమ్మ, బాలింతలు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.



పోషకాహారంపై బెలుగుప్పలో అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీలు

బెలుగుప్ప : మండల పరిధిలోని గంగవరం సెక్టార్‌లోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుణ మాట్లాడుతూ అందుబాటులో లభించే తాజా ఆకుకూరలు, కాయగూరలు, పప్పు దినుసులు, మాంసకృతులు వంటి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపర్‌వైజర్ రమణ, వసంత, ఎంఎల్‌హెచ్‌పి శుభన్, సెక్టార్ లీడర్లు వరలక్ష్మి, రాధా, తదితరులు పాల్గొన్నారు.